క్లుప్తంగా

మొక్కలు నాటిన లయన్స్‌క్లబ్ సిబ్బంది



బోట్‌క్లబ్ ఉద్యానవనంలో మొక్కలు నాటుతున్న లయన్స్ క్లబ్ కాకినాడ స్టార్స్

కాకినాడ రూరల్: బోట్‌క్లబ్ ఉద్యానవనంలో లయన్స్ క్లబ్ కాకినాడ స్టార్స్ ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు షర్మిల మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం తమ వంతుగా మొక్కలు నాటుతున్నామని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని సామాజికంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కాకినాడ స్టార్స్ కార్యదర్శి ఇంద్రగంటి నాగేశ్వరి, కోశాధికారి నాగమణి, అడబాల రత్నప్రసాద్, ఓం నమశ్శివాయ, చింతపల్లి సుబ్బారావు, డాక్టరు శిరీష, రవిశంకర్ పట్నాయక్, ఐరెడ్డి వెంకటరావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సంకురాత్రి ఫౌండర్ చంద్రశేఖర్‌కు సత్కారం



పద్మశ్రీ సంకురాత్రి చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న వాకడ చిన్ని

బాలాజీచెరువు: సంకురాత్రి ఫౌండేషన్ ద్వారా పేదలకు వైద్య, విద్యాసేవలు అందిస్తున్న పద్మశ్రీ సంకురాత్రి చంద్రశేఖర్‌ను శనివారం సత్కరించారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా యంగ్‌మైండ్ వ్యవస్థాపకులు వాకాడ చిన్ని సత్కరించి ఆయన సేవలు కొనియాడారు. శారద పీఠ విద్యార్థులకు యంగ్‌మైండ్ విద్యార్థులకు నవోదన గైడ్‌లైన్స్ అందజేసి మెటీరియల్ అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు కామేష్, మధు, గౌరీ, కరీంలు పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి



సబ్‌జైలును పరిశీలిస్తున్న మేజిస్ట్రేట్ సాహితి, చిత్రంలో జైలు సూపరింటెండెంట్ వీరబాబు

కాకినాడ లీగల్: ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలని, కుటుంబ సభ్యుల కోసం ఆలోచించాలని కాకినాడ ఒకటో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ వి.సాహితి తెలిపారు. శనివారం స్థానిక స్పెషల్ సబ్‌జైల్‌ను మేజిస్ట్రేట్ పరిశీలించారు. ఈ సందర్భంగా మేజిస్ట్రేట్ సాహితి అనేక చట్టలపై అవగాహన కల్పించారు. నిందితులను కేసులు గురించి అడిగి తెలుసుకున్నారు. సబ్‌జైలులో వసతులు పరిశీలించారు.ఈ కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ ఎం.వీరబాబు,సబ్‌జైలు సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో అంతర్గత బదిలీలు

- మేనేజర్‌గా శిరీష్
- అకౌంటెంట్‌గా సత్యనారాయణ

కాకినాడ: కాకినాడ నగరపాలక సంస్థలో పని చేస్తున్న ఇద్దరు అధికారులను అంతర్గత బదిలీలు చేస్తూ కార్పొరేషన్ కమిషనర్ భావన శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత మేనేజర్ కర్రి సత్యనారాయణను అకౌంటెంట్ గాను, అకౌంటెంట్ శిరీష్‌ను మేనేజర్ గాను మార్పు చేశారు. ఒకటి రెండు రోజుల్లో ఇద్దరు బాధ్యతలు తీసుకోనున్నారు. అలాగే కాకినాడ నగరపాలక సంస్థ ఎస్ఈగా పని చేస్తున్న పి.సత్యకుమారి విజయవాడ బదిలీ అయ్యారు. ఆమె విధుల నుంచి రిలీవ్ అయ్యారు. కొత్త సూపరింటెండెంట్ ఇంజినీర్ ఇంకా బాధ్యతలు తీసుకోవాల్సి ఉంది.

నేటి నుంచి సీవైఎఫ్ యువజనోత్సవాలు



మూర్తిరాజు

కాకినాడ సిటీ: సెల్ ఫోన్‌పై యువతకు అవగాహన కల్పించేందుకు ఈ సంవత్సరం సీవైఎఫ్ అంతర్జాతీయ యువజన మహోత్సవాల్లో ప్రత్యేక నాటికలు రూపొందించామని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత సీవైఎఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బీహెచ్‌వీ మూర్తిరాజు శనివారం తెలిపారు. ప్రస్తుత యువత విజ్ఞానం నేర్చుకోవాల్సిన సమయంలో అజ్ఞానంలో కొట్టుమిట్టాడుతున్నారని, సెల్‌ఫోన్ ద్వారా వారు చేసే వెకిలి వేషాలతో అవమానపడుతున్నారన్నారు. 60 శాతం పైగా యువత సెల్‌ఫోన్ వల్ల అంధకారంలో ఉంటున్నారన్నారు. ప్రాణాలు కోల్పోతున్నారని, అందుకే వారికి ప్రత్యేక అవగాహన కల్పించి వారి భవిష్యత్తు పునాది వేయడానికి నేటి నుంచి మూడు రోజులపాటు కాకినాడ కుళాయి చెరువు ఫ్యాబిన్ కన్వెన్షన్‌లో ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ సెల్టు హెల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు మూర్తిరాజు వివరించారు. ఈ కార్యక్రమంలో పలు రాష్ట్రాల నుంచి యువత, దైవజనులు, రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు పాల్గొంటారన్నారు. ప్రతి రోజు సాయంత్రం 6 గంటల నుంచి అందరికీ ఉచిత ప్రవేశం ఉంటుందన్నారు.

ఇది ఫ్లెక్సీ ఫుల్ సిటీ





- అమలుకాని 'ఫ్లెక్సీ ఫ్రీ సిటీ'
- ఎక్కడికక్కడే ప్రకటన బోర్డులు
- కూటమి పార్టీలతోనే తలనొప్పి
- నియంత్రణ లేక ఇష్టారాజ్యం

కాకినాడ: కాకినాడ నగరాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రతిపాదించిన ఫ్లెక్సీ ఫ్రీ సిటీ కార్యక్రమం ఆచరణకు ఆమడదూరంలో ఉంది. జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ప్రత్యేక అధికారిగా ఉన్న కాకినాడలో ఫ్లెక్సీ రహిత నగరం కాస్తా ఫ్లెక్సీ ఫుల్ సిటీగా దర్శనమిస్తోంది. ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన ఫ్లెక్సీ ఫ్రీ సిటీ ప్రక్రియ క్రమేపీ నీరుగారుతోంది. రోడ్లపై ఇష్టానుసారంగా వెలుస్తోన్న ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, ఇతర ప్రకటన బోర్డులను నిర్ణీత ప్రధాన ప్రాంతాల్లో అదుపు చేసే లక్ష్యంతో కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఇక్కడ బాధ్యతలు తీసుకున్న కొద్దిరోజులకే ఫ్లెక్సీ ఫ్రీ సిటీగా చేయాలని ప్రకటించారు. అందుకు నిర్దిష్టమైన ఆదేశాలు కూడా ఇచ్చారు. ప్రధానంగా కాకినాడలో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండే భానుగుడి నుంచి టూటౌన్, నూకాలమ్మగుడి, రాజాట్యాంక్, ఎండోమెంట్ కార్యాలయవీధి, పీఆర్ కళాశాల రోడ్డు మీదుగా కలెక్టరేట్ వరకు తొలివిడత ఫ్లెక్సీ ఫ్రీ సిటీని ప్రకటించారు. ఆ తరువాత దేవాలయం వీధి, సినిమా రోడ్డు ప్రాంతాల్లో కూడా ఈ విధానాన్ని అమలు చేయాలని ఆదేశాలు ఇచ్చారు.

అమలుకు నోచుకోని వైనం

ఫ్లెక్సీ ఫ్రీ సిటీ ప్రక్రియ ఆరంభంలో కాస్తంత దూకుడు కనిపించినా తరువాత నీరుగారిపోయింది. అధికార కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేసేస్తున్నారు. సిటీ, రూరల్ ఎమ్మెల్యేలకు చెందిన ఫ్లెక్సీలను, హోర్డింగ్‌లను అడ్డు, అదుపు లేకుండా పెట్టేస్తున్నారు. చివరకు ఎన్టీఆర్, వైఎస్ఆర్‌తోపాటు అనేక మంది దేశనాయకుల విగ్రహాలతో కూడిన ఐలాండ్ ప్రాంతాలను సైతం ఫ్లెక్సీలతో నింపేసి నగర సుందరీకరణకు అవరోధం కల్పిస్తున్నారు. కూటమి పార్టీల వైఖరితో కార్పొరేషన్ యంత్రాంగం నిస్సహాయస్థితికి చేరిపోయింది.

ఫ్లెక్సీ ఫ్రీ సిటీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ప్రకటన బోర్డులు

ఫ్లెక్సీలు తొలగిస్తాం



ఫ్లెక్సీ ఫ్రీ సిటీ ప్రాంతంలో అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు పెడితే కఠిన చర్యలు తీసుకుంటాం. అలా ఏర్పాటు చేసిన బోర్డులు, హోర్డింగ్‌లను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నాం. ఇందుకోసం ఆరుగురు సిబ్బందితో ఒక టీమ్ కూడా ఏర్పాటు చేశాం. నగర సుందరీకరణ దృష్ట్యా ప్రతి ఒక్కరూ ఫ్లెక్సీ ఫ్రీ సిటీ కోసం సహకరించాలి.
– నాగశాస్త్రులు, ఇన్‌చార్జ్ డీసీపీ, కాకినాడ నగరపాలకసంస్థ

కలెక్టర్ ఆదేశాలు అమలు చేయలేక...

టీడీపీ, జనసేన పార్టీల ఫ్లెక్సీలను తొలగించలేక టౌన్‌ప్లానింగ్ విభాగం తలలు పట్టుకుంటోంది. అధికారుల వైఫల్యాన్ని ఎండగడుతూ పౌర సంక్షేమ సంఘం తరఫున సామాజిక వేత్త దూసర్లపూడి రమణరాజు ఇటీవల కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష కూడా చేశారు. చివరకు ఒకానొక దశలో కలెక్టరేట్ ముఖద్వారానికి సైతం మంత్రులకు స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసేంత స్థాయికి తీసుకువెళ్లిపోయారు. దీనిపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకోకపోతే స్వయంగా ఆయన ప్రకటించిన ఫ్లెక్సీ ఫ్రీ సిటీ ఫ్లెక్సీ ఫుల్ సిటీగానే ఉండిపోతుందనడంలో సందేహం లేదు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు

ఉద్యోగ భద్రతకు వలంటీర్ల ఉద్యమించాలి



వలంటీర్ల ఉద్యోగ భద్రత కోసం ఏర్పడిన జిల్లా కమిటీ

కాకినాడ సిటీ: ఏపీ గ్రామ, వార్డు వలంటీర్ల సంఘం జిల్లా సమావేశంలో సుందరయ్యభవన్‌లో శనివారం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, బకాయి పెట్టిన నాలుగు నెలల వేతనం తక్షణం చెల్లించాలని, వలంటీర్లకు జాబ్ చార్టి ప్రకటించాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ మేరకు రూ.10 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్‌గా చెక్కల రాజ్‌కుమార్, కో కన్వీనర్లుగా అడ్డాల ప్రకాష్‌బాబు, చెదులూరి అప్పారావు, కాదా దుర్గాప్రసాద్, వరలక్ష్మి, దాట్ల రమేష్, కునిరెడ్డి రవికుమార్, బ్లెస్సింగ్ రాజా, నిమ్మన నాగలక్ష్మి, ఇనుకోటి వరణ్‌లతో జిల్లా కన్వినింగ్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అన్ని మండలాల్లో వలంటర్ల విస్తృత సమావేశాలు నిర్వహించి సంఘాన్ని బలోపేతం చేసుకుని అక్టోబర్ 27వతేదీన కాకినాడలో భారీ ర్యాలీ నిర్వహించాలని సమావేశం తీర్మానించింది. ఈ ర్యాలీకి అన్నిన మండలాల నుంచి వలంటీర్లు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

15న అరుణాచలానికి బస్సు

కాకినాడ: అరుణాచలం వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ఈ నెల 15వ తేదీన ప్రత్యేక బస్సు నడపనున్నట్టు ఏపీఎస్ఆర్టీసీ కాకినాడ డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్ చెప్పారు. ఆ బస్సు కాకినాడలో 15వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు బయలుదేరి కాణిపాకం, శ్రీపురం దర్శనం అనంతరం అరుణాచలం వెళ్లి అక్కడ గిరిప్రదక్షిణలు అయ్యాక పెదకంచి, కాళహస్తి దర్శనం తరువాత 18వ తేదీ రాత్రి 10 గంటలకు కాకినాడ చేరుకుంటుందని తెలిపారు. ఈ బస్సుకు అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉందన్నారు. టిక్కెట్ ధర రూ.3,100 నిర్ణయించామని తెలిపారు. టికెట్ బుకింగ్ కోసం 73829 10869, 73829 10778 నంబర్లను సంప్రదించవచ్చునని తెలిపారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పరిశుభ్రత

కాకినాడ: స్వచ్ఛత సేవ పక్షోత్సవాల్లో భాగంగా శనివారం కాకినాడ ఆర్టీసీ డిపోలో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. కాకినాడ జిల్లా ప్రజారవాణాఅధికారి ఎం.శ్రీనివాసరావు ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొని బస్టాండ్, గ్యారేజి పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలు కూడాన పరిసరాల పరిశుభ్రతపై దృష్టిసారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్, అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, అసిస్టెంట్ ఇంజినీర్ కె.ప్రభాకర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సామాన్యులకు దర్శనం ఎలా?

బోట్‌క్లబ్: కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా పేరొందిన సూర్యారావుపేట బాలా త్రిపుర సుందరి అమ్మవారి దర్శనం కోసం భక్తులను రూ.20, రూ.30, రూ.50 టిక్కెట్లు కొనుగోలు చేసుకొని వెళ్లడం ఎంతవరకూ సమంజసమని భోగిగణపతి పీఠం వ్యవస్థాపకులు దూసర్లపూడి రమణరాజు శనివారం ఒక ప్రకటనలో వాపోయారు. సాధారణ భక్తులు గుడికి రావాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. భక్తులు గుడికి వెళ్లాలంటే క్యూలో నిలబడి టిక్కెట్ కొనుక్కోవడం తప్పని పరిస్థితి ఉందన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి గుడికి వస్తే జేబులు ఖాళీ అయ్యే పరిస్థితి నెలకొందన్నారు. ఈ విషయంపై దేవదాయశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జై భవానీ

- దుర్గమ్మ నామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- భక్తుల ప్రత్యేక పూజలు



పుస్తకపాణి అలంకరణలో దర్శనమిచ్చిన బాలా త్రిపుర సుందరి అమ్మవారు



సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన బాలా త్రిపుర సుందరి అమ్మవారు



చంద్రఘంటిక అలంకరణలో కనకదుర్గమ్మ

బోట్‌క్లబ్: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా శనివారం దుర్గమ్మ అమ్మవారు వివిధ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక సూర్యారావుపేటలోని బాలా త్రిపుర సుందరి అమ్మవారు పుస్తకపాణి అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకొనేందుకు అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయం కిటకిటలాడింది. ఉచిత దర్శనం కోసం గంటకుపైగా క్యూలైన్‌లో నిలబడాల్సి వచ్చింది. దాతల సహకారంతో భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రసాదం పంపిణీ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా వాసవీ ఆర్య మహిళా మండలి ఆధ్వర్యంలో లలితా సహస్ర నామపారాయణ, బి.జన్యశ్రీ కూచిపూడి నృత్యం, నాట్యభారతి విద్యార్థులు కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది. స్థానిక దేవాలయం వీధిలో ఉన్న బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని సరస్వతిదేవిగా అలంకరించారు. ఆలయంలో స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి నవావర్ణార్చన పూజ చేశారు. మధ్యాహ్నం ఆలయంలో అన్నదానం నిర్వహించారు. ఆలయంలో పండితులు ఆధ్వర్యంలో చండీహోమం నిర్వహించారు. మాధవనగర్‌లో ఉన్న కనకదుర్గ అమ్మవారు చంద్ర ఘంటిక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక భానుగుడి భానులింగేశ్వరస్వామి ఆలయంలోని ఉషా రాజరాజేశ్వరి అమ్మవారు గాయత్రిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు కుంకుమపూజలు నిర్వహించారు. స్థానిక రిజర్వులైన్ అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న కామాక్షి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వారికి పూజా సామాన్లు ఉచితంగా అందించారు. స్థానిక అశోక్‌నగర్ సాయిబాబా ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని ఆలయ కమిటీ చైర్మన్ వేదుల అచ్యుతరామారావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంతచెరువు కనకదుర్గ అమ్మవారి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

రాజ మాతంగి అమ్మవారిగా ..

కాకినాడ రూరల్: రమణయ్యపేట శ్రీపీఠంలోని ఐశ్వర్యాంబిక అమ్మవారు మూడో రోజు భక్తులకు రాజ మాతంగిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు సాయంత్రం నుంచి తరలిచ్చారు. మండలంలోని పలు గ్రామాలలో దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గ్రామాలలో భవాని భక్తులతో ఆధ్యాత్మిక సందడి చేస్తుండగా మహిళలు కుంకుమ పూజలు చేస్తున్నారు.

అమ్మవారి ఆలయాల కిటకిట

కరప: మండలంలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆయా గ్రామాల్లో వివిధ అవతారాలలో దర్శనమిస్తున్న అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కరప శివాలయంలో పర్వత వర్ధినీదేవి పుస్తకపాణి అవతారంలో దర్శనమిచ్చారు. అర్చకులు విలపర్తి శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అర్చకుడు కంపెళ్ళ చక్రధర్ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు నిర్వహించారు. హైస్కూల్ సెంటర్‌లోని దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణమ్మగా అలంకరించగా భక్తులు దర్శించుకున్నారు. కూరాడ, నడకుదురు, అరట్లకట్ట, వేళంగి, వేములవాడ, సిరిపురం, వాకాడ, గొర్రిపూడి, జెడ్ భావారం, పెనుగుదురు, కొరుపల్లి, వలసపాకల, విజయరాయుడుపాలెం, పెద్దాపురప్పాడు, కొంగోడు, యండమూరు తదితర గ్రామాల్లో అమ్మవారి శరన్నవరాత్ర ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.



అయ్యప్పస్వామి ఆలయంలో కామాక్షి అలంకరణలో అమ్మవారు



సంతచెరువు కనకదుర్గ ఆలయంలో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలోని కనకదుర్గమ్మ



రాజ మాతంగి అమ్మగా రమణయ్యపేటలో ఐశ్వర్యాంబిక



పుస్తకపాణి అవతారంలో అమ్మవారు

పారిశుధ్య కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వీరాంజనేయులు

కాకినాడ సిటీ: సమాజంలో పారిశుధ్య కార్మికులు వివక్షను ఎదుర్కొంటూ ప్రజా ఆరోగ్యం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. శనివారం కాకినాడ గాంధీభవన్‌లో పారిశుధ్య కార్మికుల సమాఖ్య ఆవిర్భావ సభలో ఆయన మాట్లాడారు. పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. పాలక వర్గ పార్టీలు తమ ప్రచారానికే పరిమితమవుతున్నారే తప్ప ఆ స్వచ్ఛ భారత్ నిర్వహించిన కార్మికులను మాత్రం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఇటువంటి తరుణంలో పారిశుధ్య కార్మికులు సమాఖ్య ఆవిర్భవించడం అభినందనీయమన్నారు. కార్మికులు సంఘటితంగా తన సమస్యలు పరిష్కారం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్మిక చట్టాలు సక్రమంగా అమలు చేయడం లేదని, పీఎఫ్, ఈఎస్ఐ, బీమా, బోనస్ వంటి సౌకర్యాలు అమలు చేయడం లేదన్నారు. కనీసం గ్లౌజులు, షూస్, యూనిఫాం, సబ్బులు, నూనె వంటి కనీస భద్రత చర్యలు చేపట్టడం లేదన్నారు. ఐదేళ్ల పని చేసిన కార్మికులను పర్మినెంట్ చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కార్మికులకు పంచాయతీ నిధులపై ఆధారపడకుండా ట్రెజరీ ద్వారా ప్రత్యేక గ్రాండ్ ద్వారా జీతాలు చెల్లించాలని సమావేశం తీర్మానించింది. పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులకు ఆక్యుపెన్సీ హెల్త్ అలవెన్స్ రూ.6 వేలు ఇవ్వాలని, కార్మికుల పిల్లలకు ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో 25 శాతం రాయితీ కల్పించాలని తీర్మానాలు ఆమోదించారు. ఈ సమావేశంలో నాయకులు కరీంభాషా, వల్లూరి రాజబాబు, బి రమేష్, కొండా దుర్గారావు, కడితి సతీష్, గుడాల చార్లెస్, బోడపాటి విష్ణు, కర్నాకుల రామలింగేశ్వరరావు, తిరుమలశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అరేయ్ బాగున్నావా..



51 ఏళ్ల తర్వాత కలుసుకున్న కాజులూరు హైస్కూల్ పూర్వ విద్యార్థులు

- ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కాజులూరు: ఎన్నాళ్లయిందీ నిన్ను చూసి.. ఏంటిరా ఇంత మారిపోయావు.. అసలు ఎక్కడుంటున్నావు.. ఏం చేస్తున్నావంటూ ఆప్యాయ పలకరింపులతో ఆనందాల సిరిజల్లు కురిసింది. 51 ఏళ్ల తర్వాత కలుసుకున్న ఆ పూర్వ విద్యార్థులంతా సందడి చేశారు. 1973 విద్యా సంవత్సరంలో కాజులూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదువుకున్న విద్యార్థులు కాకినాడలో లైఫ్‌లైన్ ఆసుపత్రిలో కలుసుకున్నారు. శనివారం వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ కె.బాబ్జీ ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. డాక్టర్లు, ఇంజినీర్లు, టీచర్లు ఇలా వివిధ హోదాల్లో స్థిరపడిన చిన్ననాటి మిత్రులంతా కలసి ఆప్యాయంగా పలకరించుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అందరూ కలసి ఉమ్మడిగా చదువుకున్న పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని సంకల్పంతో ముందుకు సాగారు. ఆనాడు వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు సర్వేశ్వరరావు, కామేశ్వరరావు, ఆంజనేయులు, వెంకటేశ్వరరావులను సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులంతా పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో వెలుగుబంట్ల గంగరాజు, పెద్దిశెట్టి రాముడు, మహాలక్ష్మి, నున్న రామకృష్ణ, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పతకాలు



రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): కడప జిల్లా రైల్వే కోడూరులో ఈనెల 4, 5 తేదీల్లో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు పలు విభాగాల్లో పతకాలు సాధించారని సమాఖ్య కార్యదర్శి శివరామ్కృష్ణ శనివారం తెలిపారు. డి.తోమ జగన్ బంగారు, ఎస్.అఖిల్ రజత, సత్యసాయి రామ్ రజత, పి.బి.చైతన్య రజత, పి.ధనుష్‌తేజ కాంస్య, జి.యశ్వంత్ రజత, వి.వర్ష కాంస్య, పి.దర్శిని కాంస్య పతకాలు సాధించారన్నారు. మొత్తం 8 పతకాలను విద్యార్థులకు వరించాయని తెలిపారు. క్రీడాకారులు తైక్వాండో కోచ్ బి.అర్జునరావు వద్ద శిక్షణ పొందుతున్నారు.

ఎంపీడీవోగా అనుపమ బాధ్యతల స్వీకరణ



ఎంపీడీవోను మర్యాద పూర్వకంగా కలిసిన కార్యదర్శులు

కరప: స్థానిక ఎంపీడీవోగా మట్టపర్తి అనుపమ శనివారం బాధ్యతలు స్వీకరించారు. తాళ్లరేవు మండల ఎంపీడీవోగా పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. మండల అభివృద్ధికి పాటుపడతారని స్పష్టం చేశారు. బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవోను కార్యాలయ సిబ్బంది, ఆయా పంచాయతీ కార్యదర్శులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఎన్నికల ముందు బదిలీపై వెళ్లి తిరిగి కరప ఈవోపీఆర్డీగా సలాది శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఈవోపీఆర్డీగా పనిచేస్తున్న బసవరాజు సత్యనారాయణ బదిలీపై కృష్ణాజిల్లా వెళ్లారు.

గడ్డి మందు తాగి మహిళ ఆత్మహత్య

కరప: అనారోగ్య సమస్యను తట్టుకోలేక గడ్డి మందు తాగి మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. యండమూరు గ్రామానికి చెందిన రాయుడు సత్యవతి(52) ఈ నెల 3వ తేదీన భర్త శ్రీనివాసరావుతో కలిసి అమ్మవారి ఆలయంలో భజన కార్యక్రమానికి వెళ్లింది. తిరిగి వస్తుండగా మార్గమధ్యలో ఒక్కసారిగా కళ్లు తిరిగి పడిపోయింది. దీనిపై ఆరా తీయగా మోకాళ్ల నొప్పులను భరించలేక ఇంటి నుంచి బయటకు వచ్చే ముందు గడ్డి మందు తాగినట్టుగా భర్తకు వివరించింది. దీంతో హుటాహుటీన కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్టు కరప ఎస్సై తోట సునీత తెలిపారు.